క్లుప్తంగా

దోమకాటుకు దూరంగా ఉండాలి



పిడుగురాళ్ల రూరల్: దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, జికా వైరస్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని కరలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని కరాలపాడు గ్రామంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాణి చిన్నది అయినా దాని కాటు వచ్చి ప్రమాదం పెద్దది అని పేర్కొన్నారు. కురుస్తున్న వర్షాలకు దోమలు వస్తున్నాయని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమల వలన కలిగే వ్యాధులకు సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకం కావచ్చు అని తెలిపారు.

దివ్యాంగుల పింఛన్‌కు దరఖాస్తులు



పిడుగురాళ్ల: అర్హులైన దివ్యాంగులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను దివ్యాంగులు వినియోగించుకోవాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఐఈడీ కో ఆర్డినేటర్ ఆర్.సెల్వరాజ్ మాట్లాడుతూ..ఈ మెడికల్ క్యాంపునకు 260 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో భవిత రీసోర్స్ పర్సన్ అజిత్‌కుమార్, హరికుమార్, డాక్టర్లు నితిన్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు తోపుడు బండ్లు



కారెంపూడి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెత్త సేకరించి తరలించేందుకు 22 తోపుడు బండ్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఈఓపీఆర్డీ కసిన్యా నాయక్ బుధవారం తెలిపారు. ఇక నుంచి తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా సేకరించేందుకు వీలుగా తోపుడు బండ్లను క్లాప్ మిత్రాలు ఉపయోగిస్తారని చెప్పారు. కారెంపూడి గ్రామ పంచాయతీకి 10, ఒప్పిచర్లకు 6, మిరియాలకు 2, లక్ష్మీపురం 1, గాదెవారిపల్లె 1, కాచవరం 1, ఇనుపరాజుపల్లె గ్రామ పంచాయతీకి ఒక బండి వచ్చాయని వీటిని ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించనున్నట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలి



సత్తెనపల్లి: జిల్లాలోని ప్రతి గ్రామంలో ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయనున్నామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి గ్రామానికి విస్తరింపజేసే లక్ష్యంతో సత్తెనపల్లి వ్యవసాయ విత్తన పరిశోధన కేంద్రంలో మూడు రోజులుగా రైతు సేవా కేంద్రం సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానాన్ని ఆచరించడం వలన అదనపు ఆదాయంతో పాటు మిరపలో తామర పురుగు, రసం పీల్చే పురుగులను నివారించవచ్చన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ సంవత్సరం సత్తెనపల్లి డివిజన్ పరిధిలో మొత్తం 21 క్లస్టర్లలో 2,625 మంది రైతులు, 2,625 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. పెదకూరపాడు ఏవో కృష్ణయ్య మాట్లాడుతూ రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ శిక్షణలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, పెదకూరపాడు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి మార్గదర్శనం చేశారు. అనంతరం ఉత్సాహవంతమైన వీఏఏ, వీహెచ్ఏలకు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి చేతుల మీదుగా మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి, ముప్పాళ్ల ఏఓలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్ రెడ్డి, జిల్లా శిక్షకులు సైదయ్య, నందకుమార్, హనుమయ్య, డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు బ్యూలా, అమూల్య, పూజ పాల్గొన్నారు.

నూతన భవనాలకు కూటమి గ్రహణం

- గత ప్రభుత్వ హయాంలో సచివాలయ సొంత భవనాల నిర్మాణం
- ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభం ఆలస్యం
- ప్రస్తుతం ప్రారంభానికి ఆసక్తి చూపని కూటమి నేతలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న ప్రజలు



ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు



రైతు భరోసా కేంద్రం



ప్రస్తుతం చిన్న గదిలో కొనసాగుతున్న గ్రామ సచివాలయం

దుర్గి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసింది. సచివాలయాలకు ఆదరణ పెరిగింది. ప్రజలు సచివాలయాలకు వచ్చి నిర్భయంగా పనులు చేయించుకున్నారు. అద్దె భవనాల్లో నడిశాయి. ఉద్యోగులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అప్పటి ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణానికి ఉపక్రమించింది. ఆ మేరకు నిధులు కేటాయించింది. చాలా ప్రాంతాల్లో నూతన భవనాలను ప్రారంభించారు. కొన్ని కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేకపోవడంతో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు.

కూటమి అధికారంలోకి రావడంతో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తోంది. అయినా గ్రామ సచివాలయ భవనాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. దుర్గి బస్టాండ్ సెంటర్‌లోని పూర్వపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ చిన్న ఇరుకు గదిలో ప్రస్తుతం ప్రజలకు సేవలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలో సరైన మౌలిక వసతులు లేక వచ్చిన మహిళలకు, వృద్ధులకు అసౌకర్యంగా ఉంది. వీటి వలన ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందమైన నూతన భవనాలు నిర్మించినా కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారన్న ఒక్క కారణంతో ఆ నూతన భవనాలను నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్కడెక్కడ భవనాలు ఉన్నాయంటే..

దుర్గిలో రెండు గ్రామ సచివాలయ భవనాలు నిర్మించారు. వీటితో పాటు రైతు భరోసా కేంద్రం పూర్తి అయింది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు గుర్తెరిగి ప్రజల సొమ్ముతో నూతనంగా నిర్మించిన సౌకర్యవంతమైన సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. రైతుల శ్రేయస్సు కోసం నిర్మించిన రైతు సేవా కేంద్రం అన్నీ విత్తనాలు, ఎరువులు నిల్వ చేసేందుకు, సిబ్బందికి అనుకూలంగా ఉన్న కార్యాలయాలను నేడు స్థానిక సొసైటీ కార్యాలయంలో ఇరుకు గదులలో కొనసాగించటం పట్ల రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వాధికారులు ఆయా భవనాలను ఏదో విధంగా ఉపయోగించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రజా శ్రేయస్సు తరువాతే రాజకీయాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల శ్రేయస్సు కోసం గ్రామ సచివాలయ వ్యవస్థను మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. ప్రజలకు సౌకర్యవంతమైన, సుందరమైన, ప్రజల అవసరాలు తీర్చే ప్రజాధనంతో భవనాలను నిర్మించారు. వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవటం కేవలం కక్ష్యసాధింపు చర్యగానే ప్రజలు భావిస్తున్నారు. ప్రజా శ్రేయస్సు తరువాతనే రాజకీయాలు.

– శెట్టిపల్లి యలమంద, జెడ్పీటీసీ సభ్యుడు

కొత్త భవనాలు ప్రారంభించాలి



ఎంతో విశాలంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ప్రస్తుతమున్న చిన్న కార్యాలయంలో రెండు సచివాలయాల పరిధిలోని ప్రజలు సేవలు పొందేందుకు వెళ్లిన సందర్భంలో అసౌకర్యంగా ఉంది. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

–ఉప్పల అంజి, గ్రామస్తుడు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

- జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు
- దాచేపల్లిలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

దాచేపల్లి: క్రమశిక్షణతో చదవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు విద్యార్థులకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని రామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ఆయన ముచ్చటించి కాసేపు ఉపాధ్యాయుడిగా మారారు. చిన్నారులతో ఇంగ్లిష్, తెలుగు అక్షరాలతో పాటు అంకెలను చెప్పించి వారితో కలెక్టర్ సరదాగా గడిపారు. కేంద్రంలో చిన్నారులపై కార్యకర్త తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను అభినందించారు. అనంతరం రామ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు చేసి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యా విధానంపై విద్యార్థుల నుంచి ఆరా తీశారు. పట్టుదల, కృషి, శ్రద్ధతో చదువుకుంటే జీవితంలో ఉన్నతమైన స్థానంలో ఉండవచ్చని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట డీఈఓ చంద్రకళ, గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, డెప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, ఎంఈఓ పినాకపాణి, ఆర్ఐ శరత్ బాబు, వీఆర్ఓ పత్రా రమేష్ ఉన్నారు.

విశ్వజననీ సేవా రత్న అవార్డుకు పలువురి ఎంపిక



చెన్నకేశవరావుకు అవార్డును అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



ప్రసాద్‌కు అవార్డును అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మాచర్ల: విశ్వజననీ సేవా రత్న సభ్యులు అవార్డును సామాజిక సేవా కార్యకర్త, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో విశ్వజననీ ఫౌండేషన్, వివిధ సేవా రంగంలో కృషి చేసిన వ్యక్తులకు అవార్డులను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా వాసవి క్లబ్, లయన్స్ క్లబ్ సంఘాల ద్వారా వివిధ సామాజిక సేవలను నిర్వహించటం, సీనియర్ పాత్రికేయుడుగా తన సేవలను గుర్తించి అవార్డు అందించటం ఆనందంగా ఉందన్నారు. చెన్నకేశవరావును పలువురు ప్రముఖులు, వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ప్రెసిడెంట్లు భవనాశి రవితేజ, భవనారి సత్యనారాయణ, మేడం నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు, బచ్చు రాజ్ కుమార్, బత్తుల బ్రహ్మం, చుండూరు సత్యనారాయణ, చుండూరు వెంకటేశ్వర్లు, కొత్తమాసు శ్రీరామమూర్తి, తుమ్మేపల్లి సాంబశివరావు, ఉప్పుతోళ్ళ రమేష్ అభినందనలు తెలిపారు.

సామాజిక సేవ కార్యకర్త కాసుల..

దుర్గి: విశ్వజననీ సేవా రత్న అవార్డును మండల కేంద్రమైన దుర్గికి చెందిన సీనియర్ సామాజిక సేవా కార్యకర్త, వాసవి క్లబ్ సభ్యులు కాసుల ప్రసాద్ అందుకున్నారు.హైదరాబాద్‌లో విశ్వజననీ ఫౌండేషన్, వివిధ సేవా రంగంలో కృషి చేసిన వ్యక్తులకు అవార్డులను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా వాసవి క్లబ్, ఆర్య వైశ్య సంఘాల ద్వారా వివిధ సామాజిక సేవలను నిర్వహించటం, దానికి గుర్తించి, దానిని గుర్తించి అవార్డు రావటం ఆనందంగా ఉందన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను సన్మానిస్తున్న డీటీలు వాణి, బాషా, రెవెన్యూ ఉద్యోగ సంఘు నాయకులు

మాచర్ల రూరల్: ఉత్తమ సేవ అవార్డు అందుకున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్లు బత్తుల వాణి, షేక్ బాషా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరించడంతో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా కింది స్థాయి ఉద్యోగులందరినీ సమన్వయ పరుస్తూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అనిల్‌కుమార్ సేవలనూ గుర్తించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఉద్యోగ సంఘు అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు రంగారావు, అనిల్ కుమార్, ఖాజావలి, వెంకటరావు, చిరంజీవి, ఏసురాజు, అంజి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

డీపీఓ నాగేశ్వరరావు నాయక్



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్

కారెంపూడి: ఇక నుంచి అన్ని పంచాయతీల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్ కోరారు. మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో బుధవారం సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి దానిని కంపోస్టు ఎరువుగా మార్చే విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా తడి పొడి చెత్తలను వేర్వేరు డస్ట్ బిన్‌లను వాడే విధంగా చైతన్యం కల్పించాలని అప్పుడు పని తేలిక అవుతుందన్నారు. ఇందు కోసం గ్రామ పంచాయతీలకు కొత్తగా పుష్ కాట్స్‌ను కూడా ఇవ్వడం జరిగిందన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కసిన్యా నాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దోమలపై అప్రమత్తంగా ఉండాలి



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, మలేరియా అధికారులు

రెంటచింతల: గ్రామాలలో నివాస పరిసరాలలో మురుగు నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రోస్ జయంతి పురస్కరించుకుని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవి రత్నాకర్ ఆదేశాల మేరకు బుధవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా ఆయన మండల కేంద్రమైన రెంటచింతలలోని పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పలు కాలనీలలో వైద్యాధికారులు, మలురియా అధికారులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.ప్రదీప్‌రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ ఎస్.కోటేశ్వరరావు, ప్రసన్నలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు షేక్ ఖాసిం, కుమారి, రమణమ్మ, ప్రమీల, సుజాత పాల్గొన్నారు.

వినాయక చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు



మాట్లాడుతున్న సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: వినాయక చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి అని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినాయక చవితి పండగను పురస్కరించుకొని మండపం వద్ద డీజేలకు అనుమతి లేదని చెప్పారు. నిమజ్జనం సమయంలో పార్టీలకు అతీతంగా ఊరేగింపులు జరుపుకోవాలని సూచించారు. అలా కాకుండా పార్టీ జెండాలు ఊపుకుంటూ ఒకరినొకరు రెచ్చగొట్టే ధోరణిలో ప్రవర్తిస్తే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఏడాది జరిగే వినాయక చవితి మండప నిర్వాహకులు తప్పనిసరిగా అఫిడవిట్ పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. మండపంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో విగ్రహ మండపం తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా కచ్చితంగా పార్కింగ్ ఏర్పాట్లలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. ఊరేగింపు సమయంలో దేవాలయాలు, చర్చిలు, హాస్పిటల్స్, నిర్దేశిత పరదేశాలలో నిశ్శబ్దాన్ని పాటించాలన్నారు. పోలీసులు విధించిన నియమనిబంధనలను అతిక్రమించి అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసి ప్రజలకు అటంకం కలిగిస్తే కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మోహన్, శివనాగరాజు ఉన్నారు.

ఉత్సవాలకు జాగ్రత్తలు తీసుకోవాలి –సీఐ భాస్కర్



దాచేపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే విగ్రహ మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ పొన్నూరు భాస్కర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. దాచేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ముందుగానే కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ వారిదే పూర్తి బాధ్యత వహించాలని చెప్పారు. మైక్, సౌండ్ బాక్స్‌లు వాడాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోమల నివారణకు ఫ్రైడేను డ్రైడేగా పాటించండి



ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

నరసరావుపేట: దోమలు వలన వచ్చే మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ మెదడు వాపు వ్యాధులు రాకుండా ప్రజలు బాధ్యతగా ప్రతి శుక్రవారాన్ని ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ సూచించారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ 1893లో సర్ డాక్టర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటిషర్ ఈ మలేరియా వ్యాధి ప్యారసైట్ వల్ల వ్యాపిస్తుందని ప్రయోగ పూర్వకంగా నిరూపించారన్నారు. అందుకుగాను ఆయన 1902లో ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ అవార్డు పొందారన్నారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలలోని నిలువ ఉన్న నీటి ని తొలగించి ఇంటి లోపల కూలర్లు, ఫ్రిడ్జ్ వెనకాల ఉండే వేస్ట్ వాటర్‌ను గమనించి నిలువ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, కుంచాల శీను పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: దోమకాటు వలన ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సాయిశ్వేత చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. రాత్రివేళల్లో దోమతెరలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి పి.కమల, సిబ్బంది నారాయణ, ఆగ్నేశమ్మ, శ్రీను, భవాని, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సన్మానం



పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల(లైమ్‌సిటీ) ఆధ్వర్యంలో ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్స్ జోకా రామదాసు, జోకా బ్రహ్మం, సీదా రాములను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కోట రమేష్‌బాబు, సెక్రటరీ పచ్చిపులుసు పాపయ్య గుప్తా, కోశాధికారి ఊటుకూరి గురునాథం, గర్రె సుబ్రహ్మణ్యం, వంకాయల గోపి, కాకుమాను శ్రీనివాసరావు, పసుమర్తి రమేష్, సయ్యద్ అమీర్ అలీ, నీరుమళ్ల రాజేష్, కొత్త హనుమంతరావు, జోకా బ్రహ్మం పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో ఆర్‌వో ప్లాంట్‌కు ఆర్థిక సాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ఆర్ఓ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.80 వేలు విలువ చేసే ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్‌ను శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్ వైద్యులు పెండ్యాల సునీల్‌కుమార్ బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు అందజేశారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ... పిడుగురాళ్ల పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ప్రజలు ప్యూరిఫైయర్ వాటర్ తాగాలనే ఉద్దేశంతోనే ఈ వాటర్ ఫిల్టర్‌ను అందజేయటం జరిగిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: నవభారత్‌నగర్ రెండో వీధి విద్యుత్ తీగల మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ -2 డీఈఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొరిటెపాడు రోడ్డు నుంచి వికాస్‌నగర్ ప్రధాన రహదారి రెండో వీధిలో అంతరాయం ఏర్పడుతుందని, బొమ్మిడాల హెచ్‌టీ సర్వీస్, సూర్య అపార్ట్‌మెంట్ ఏరియాలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

- 11 కేవీలైన్ మెయింటెన్స్ దృష్ట్యా గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మారుతీనగర్, భాగ్యనగర్, తుఫాన్ నగర్, నాయీబ్రాహ్మణ కాలనీ, తురకపాలెం రోడ్డులో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్ డెప్యూటీ ఈఈ(ఆపరేషన్) గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన



ఏరియా వైద్యశాలల సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన

సత్తెనపల్లి: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.ప్రసూన అన్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఓపీ ఆపరేటర్లు నిర్ణీత సమయానికి హాజరు కావాలని హెచ్చరించారు. అనంతరం డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలను సందర్శించానని, ఈ రెండు వైద్యశాలలో సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. అయితే కొన్ని లోపాలు ఉన్నాయని వాటిని సరిచేసుకోవాల్సి ఉందన్నారు. మళ్లీ తాను వచ్చే సమయానికి మార్పులు జరగాలని ఆదేశించినట్లు చెప్పారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో సదరంకు సంబంధించి ఈఎన్‌టీ కేవలం తెనాలిలో మాత్రమే ఉందని, ఈఎన్‌టీతో పాటు సైకియాట్రి కూడా ప్రారంభించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానన్నారు. సత్తెనపల్లి వైద్యశాలలో పాలు ఇచ్చే తల్లులకు కంగారు గది ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చానన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఓపీలో ఆధార్, స్మార్ట్ ఫోన్ రోగులు తెచ్చుకున్నట్లయితే హెల్త్ రికార్డ్స్ తయారు చేయవచ్చన్నారు. ఆధార్‌తో ఆరోగ్యశ్రీ సేవలు కూడా పొందడానికి వీలు ఉంటుందన్నారు. రోజుకు 80 ఎక్స్‌రేలు జరుగుతున్నాయని చెప్పారు. అల్ట్రాసౌండ్‌కు ఒప్పందం చేసుకోవాల్సి ఉందన్నారు. ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ ఉన్నట్లయితే వైద్యశాల అన్ని విభాగాల్లో పర్ఫెక్ట్‌గా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి ఆమె ప్రత్యేక సూచనలు చేశారు. ఆమెతో పాటు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రాజేశ్వరి, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.